సాక్షి
తిరుపతి
సోమవారం । 18 । ఆగస్టు । 2025



తిరుపతిలో జోరు వాన

తిరుపతి నగరంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వీధులన్నీ జలమయమయ్యాయి. - 8లో



గుంతలు బాబోయ్!

నాగలాపురం- చిన్నపాండూరు రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. రహదారి గుంతలమయంగా మారింది. - 8లో




దయనీయం.. అయోమయం

వర్సిటీల్లోని తాత్కాలిక అధ్యాపకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోయింది. నోరెత్తలేని దుస్థితి దాపురించింది. - 8లో

కబ్జాల రాజ్యం



ఏర్పేడు మండలం శ్రీనివాసపురం శివగిరిపల్లె వద్ద ఉన్న గ్రామం కంఠం భూమిలో వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్



జిల్లాలో టీడీపీ నేతలు భూ బకాసురుల అవతారమెత్తారు. ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు తెరతీశారు. ఏకంగా ఎకరాలకు ఎకరాలనే కబళించేస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కబ్జా చేసేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసేస్తున్నారు. ప్లాట్లు అమ్మేసి రూ.కోట్లు పోగుసుకుంటున్నారు. సర్కారు ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులకు వంత పాడుతూ తమ వంతు సహరిస్తున్నారు. ఇదే అదునుగా పచ్చనేతలు అడ్డూ అదుపూ లేకుండా రెచ్చిపోతున్నారు. ప్రశ్నించిన దాడులకు పాల్పడుతున్నారు.

అడిగేదెవరు? ఆపేదెవరు?

- శివగిరిపల్లెలో గ్రామ కంఠం ఆక్రమణ
- ప్లాట్లు వేసి అమ్మకానికి పెట్టిన టీడీపీ నేత
- అనుమతులు లేకనే రియల్ ఎస్టేట్ వెంచర్
- భూ బకాసురులుగా మారిన పచ్చమూక
- జిల్లా వ్యాప్తంగా యథేచ్ఛగా కబ్జాలు
- పూర్తిగా సహకరిస్తున్న అధికారులు



పద్మగిరి కొండపై టీడీపీ నేత నిర్మించిన షెడ్డు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు, స్థలాలపై టీడీపీ నేతలు కన్నేశారు. ఆయా ప్రాంతాల్లో రెవెన్యూ అధికారుల సహకారంతో ఆక్రమించుకుంటున్నారు. అనంతరం సదరు భూములు పదేళ్లుగా తమ అనుభవంలో ఉన్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి రెగ్యులరైజ్ చేయించుకుంటున్నారు. నివాస స్థలాలకు అనువుగా ఉండే భూములే లక్ష్యంగా టీడీపీ నేతలు బరితెగిస్తున్నారు. అందులో ఏర్పేడు మండల శ్రీనివాసపురం రెవెన్యూ పరిధిలో ఆక్రమణకు గురైన గ్రామ కంఠం భూమి ఒకటి. సర్వే నంబర్ 327లో 10.30 ఎకరాల గ్రామం కంఠం భూములు ఉన్నాయి. ఏర్పేడు- వెంకటగిరి రహదారికి సమీపంలో ఉండడం, గ్రామం పక్కనే ఐజర్ వంటి కేంద్రీయ విద్యా సంస్థలు ఉండడంతో ఆ భూములకు భారీగా డిమాండ్ పెరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే అనుచరుడు అని చెప్పుకుని తిరిగే వ్యక్తి ఒకరు శ్రీనివాసపురం పరిధిలోని గ్రామం కంఠం భూములపై కన్నేశాడు. ముందస్తుగా జంగాలపల్లె-శ్రీకాళహస్తికి వెళ్లే మార్గంలోని శివగిరిపల్లె వద్ద ఉన్న విలువైన రెండెకరాల భూమిని ఆక్రమించుకున్నాడు. గ్రామస్తులు నోరెత్తకుండా ఉండేందుకు కొందరితో రాయబారాలు గ్రామానికి రూ.2 కోట్లు ముట్టజెబుతామని ప్రలోభపెట్టాడు. అధికారం ప్రయోగంతో గ్రామస్తులను ఒప్పించాడు. గ్రామ కంఠం భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తామని, ఎవరూ అడ్డుకోకూడదని, అభ్యంతరం చెప్పకూడదని అల్టిమేటం జారీ చేశాడు. ముందుగా రెండెకరాలను ఆక్రమించి ప్లాట్లు వేసి అమ్మకానికి పెట్టేశాడు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం రెండెకరాల విలువ సుమారు రూ.6 కోట్లు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

దర్జాగా రియల్ వ్యాపారం

వ్యవసాయ, ప్రభుత్వ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయదలిస్తే ముందుగా పంచాయితీ లేదా తుడా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. తుడా నుంచి అనుమతి ఉన్నా ఆయా పంచాయితీలకు సమాచారం అందించాలి. ఏర్పేడు మండలం శ్రీనివాసపురం రెవెన్యూ పరిధిలో ఇప్పటి వరకు 35 ఎకరాల్లో వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లు అమ్మకాలు సాగిస్తున్నారు. అందులో తాజాగా టీడీపీ నేత ఆక్రమించుకున్న రెండెకరాలు ఒకటి. ప్రస్తుతం శ్రీనివాసపురం పరిధిలో వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయిస్తున్నా అడిగే వారు కరువయ్యారు. అధికారుల సహకారంతో టీడీపీ నేతలు విచ్చలవిడిగా కబ్జాలకు పాల్పడుతున్నారిన స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పచ్చమూక ఆక్రమణల పర్వంలో మచ్చుకు కొన్ని..

- గూడూరు నియోజక వర్గం చిల్లకూరు మండల పరిధిలో జాతీయ రహదారికి పక్కనే రైటార్ సత్రం వద్ద రూ.కోట్ల విలువైన 1.50 ఎకరాల భూమి అక్రమణకు గురైంది.
- గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని నెలటూరు సమీపంలో విలువైన భూమిని టీడీపీ నేతలు ఆక్రమించుకున్నారు.
- వెంకటగిరి పట్టణం ఎన్జీఓ కాలనీ పరిధిలోని విలువైన ప్రభుత్వ స్థలం పచ్చమూక కబ్జాలోకి వెళ్లిపోయింది.
- వెంకటగిరి పట్టణం 14వ వార్డు పరిధిలోని బొగ్గులు మిట్ట-పెంచలకోన రహదారి క్రాస్ వద్ద ఉన్న విలువైన భూమికి సంబంధించిన రికార్డులు తారుమారు చేసి ఆక్రమించుకుని ఏకంగా గదులు నిర్మించి అద్దెకు ఇచ్చేశారు.
- తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 529/4ఎలో 0.98ఎకరాల ప్రభుత్వ భూమిని రాత్రికి రాత్రి చదును చేసి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టగా స్థానిక సర్పంచ్ దామినేటి కేశవులు, ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి స్థానికులతో కలసి అడ్డుకున్నారు.
- ఓటేరు గ్రామ పంచాయతీలో రజకులకు కేటాయించిన దోబీఘాట్‌ను ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తుంటే స్థానికులు అడ్డుకున్నారు.
- గాంధీపురం పంచాయతీ పరిధిలోని హథీరాంజీ మఠం భూములు సర్వే నంబరు 13లో 1.09 ఎకరాల భూమిని టీడీపీ నేతలు ఆక్రమించగా స్థానిక సర్పంచ్ లక్ష్మి అడ్డుకున్నారు.
- గాంధీపురం పంచాయతీ సర్వే నంబరు 13లో ఓ టీడీపీ నేత సుమారు రూ.4కోట్ల విలువైన 200 అంకణాల స్థలం ఆక్రమించి ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. ఆ సమయంలో గ్రామంలో గొడవలు జరిగినప్పటికీ రెవెన్యూ అధికారులు, పోలీసులు స్పందించలేదు.
- చిగురువాడ పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 274లో స్వర్ణముఖి నదిని ఆక్రమించి అతి పెద్ద షెడ్డు నిర్మాణం చేపట్టిన భూ ఆక్రమణదారులపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.
- దుర్గసముద్రం పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఆక్రమంగా షెడ్లు, దుకాణాలను ఏర్పాటు చేసినా అధికారులు కన్నెత్తి చూడలేదు.
- తనపల్లె వద్ద పద్మగిరి కొండ (సర్వే నంబరు 263)ను తవ్వి పచ్చనేతలు అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేస్తున్నారు. ఆ అక్రమ కట్టడాలకు అడ్డుగా వున్న ఓ నిరుపేద ఇంటి ప్రహరీ గోడను దౌర్జన్యంగా నేల కూల్చారు. ఆ బాధతో ఆ ఇంటి యజమాని రామచంద్రయ్య మంచం పట్టారు.
- చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పరిధిలోని సర్వే నంబర్ 329లోని గ్రామ కంఠం భూమి, తిప్పిరెడ్డిగారిపల్లె పరిధిలోని గ్రామ కంఠం, దేవరకొండ పరిధిలోని సర్వే నంబర్ 586లో ఐదెకరాల గ్రామ కంఠం భూమి ఆక్రమించుకున్నా అడిగే నాథుడే కరువయ్యారు.



పద్మగిరి వద్ద తన స్థలంలోకి దారి కోసం టీడీపీ నేత ధ్వంసం చేసిన ప్రహరీ గోడ

న్యూస్‌రీల్

వైభవంగా గోకులాష్టమి



ఊరేగుతున్న కల్యాణ వెంకన్న, శ్రీకృష్ణస్వామి

నారాయణవనం : పద్మావతీ సమేత కల్యాణ వేంటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోకులాష్టమి పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువనే సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. తిరుచ్చిపై శ్రీకృష్ణుని కొలువు దీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారు, గోపాలునికి స్నపన తిరుమంజనం జరిపించారు. దేవదేవేరులు, శ్రీకృష్ణస్వామివారిని తిరుచ్చిపై ఊరేగింపుగా పదహారు కాళ్ల మండపానికి వేంచేపు చేశారు. ఈ మేరకు వేడుకగా ఉట్లోత్సవం నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టి సందడి చేశారు. అనంతరం ఉత్సవర్లను ఆలయానికి తీసుకువచ్చి ఆస్థానం చేపట్టారు. ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసభట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్ పాల్గొన్నారు.

ఏసీఏ జాయింట్ సెక్రటరీగా విజయ్‌కుమార్



తిరుపతి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) జాయింట్ సెక్రటరీగా తిరుపతికి చెందిన విజయ్‌కుమార్ (క్రికెట్ విజయ్) ఎన్నికయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌కు తొలి సారిగా ఏసీఏలో స్థానం దక్కడంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. సీడీసీఏ అధ్యక్షుడిగా, ఏసీఏ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్‌గా ఆయన సేవలందిస్తున్నారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఐపీఎల్, అంతర్జాతీయ స్థాయిలో మన క్రీడాకారులు ఎక్కువ సంఖ్యలో ఆడేలా కృషి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు మౌలిక వసతులు సమకూర్చేందుకు తన వంతు ప్రయత్నిస్తామని వివరించారు. త్వరలోనే తిరుపతిలో ఉమెన్స్ క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అథ్లెటిక్స్ సంఘానికి కొత్త కమిటీ



నూతన కమిటీ

తిరుపతి సిటీ : మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ పాకనాటి హరికృష్ణ, కార్యదర్శిగా పి.రామచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా ఆనందరావు, ఓంప్రకాష్‌రెడ్డి, రాఘవులు, డాక్టర్ వెంకటేశ్వర్లు, బి.రామయ్య, కోశాధికారిగా కృష్ణప్రసాద్, కార్యనిర్వహణ కార్యదర్శిగా డాక్టర్ రామకృష్ణారెడ్డితోపాటు, మరో ఆరుగురు సభ్యులుగా ఎన్నికయ్యారు.

డీఫార్మసీతో ఉజ్వల భవిష్యత్తు

– రేపే దరఖాస్తులకు చివరి గడువు



ప్రిన్సిపల్ ద్వారకనాథ్‌రెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి డీఫార్మసీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులకు మంగళవారంతో గడువు ముగయనుందని ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథ్‌రెడ్డి తెలిపారు. డీఫార్మసీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు వంద శాతం ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉంటాయని చెప్పారు. కోర్సులో ప్రవేశం పొంది.. రేషన్ కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికెట్ కలిగి ఉన్న పేద విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు అందుతాయని తెలిపారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రవేశాలకు సంబంధించి మరిన్ని వివరాల కోసం 99088 57585, 9966761446, 99635 41557 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తిరుచ్చిపై శ్రీకృష్ణుని విహారం



చంద్రగిరి : తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంతో పాటు శ్రీనివాస మంగాపుంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణ స్వామివారు, అమ్మవార్లతో కలసి ఆదివారం బంగారు తిరుచ్చిపై విహరించారు. స్వామివారి జన్మనక్షత్రం రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకష్ణ స్వామివారిని తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.

అతీగతీ లేని అర్జీలు

- నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో అందిస్తున్న అర్జీలకు అతీగతీ లేకుండా పోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్కో సమస్యపై పలుమార్లు వినతులు సమర్పించినా ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అయినా తమ అర్జీలను పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ఆదివారం వెల్లడించారు. అర్జీలు పరిష్కారం కాని వారు తమ వినతులు ఏ దశలో ఉన్నాయో తెలుసుకునేందుకు 1100 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డీఎస్సీ ఆశలు ఢమాల్!

డీఎస్సీ కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ నిరాశనే మిగులుస్తోంది. రాత్రింబవళ్లు చదివినా రిక్త హస్తమే ఎదురవుతోంది. కష్టపడి పరీక్ష రాసినా ఫలితం శూన్యంగానే మారుతోంది. ప్రభుత్వం తీసుకువచ్చిన నార్మలైజేషన్ విధానం అభ్యర్థుల ఆశలను తారుమారు చేస్తోంది. ప్రధానంగా బయాలజీ.. సోషియల్ సబ్జెక్టులను ఎంచుకున్నవారికే అధికంగా నష్టం జరుగుతోంది. అందులోనూ ఆన్‌లైన్ ఎగ్జామ్ తొలి సెషన్‌కు హాజరైన వారే బాధితులుగా మారే దుస్థితి దాపురించింది.

- నార్మలైజేషన్‌తో పేరుతో అన్యాయం
- మార్కుల తారుమారుపై ఆక్రోశం
- బయాలజీ మార్నింగ్ షిఫ్ట్ అభ్యర్థుల ఆందోళన
- సోషియల్ సబ్జెక్ట్ వారిదీ ఇదే పరిస్థితి
- హెల్ప్‌డెస్క్‌కు మొరపెట్టుకున్న బాధితులు
- న్యాయం చేయాలని వేడుకోలు

జిల్లా సమాచారం

బయాలజీ, సోషియల్‌లో డీఎస్సీ రాసిన అభ్యర్థులు	
జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ బయాలజీ పోస్టుల సంఖ్య	63
స్కూల్ అసిస్టెంట్ సోషియల్ సబ్జెక్ట్ పోస్టుల సంఖ్య	130
బయాలజీ సబ్జెక్ట్‌తో పరీక్షలకు హాజరైన అభ్యర్థులు	3,450
సోషియల్ సబ్జెక్ట్‌తో పరీక్షలకు హాజరైన అభ్యర్థులు	6,955



తిరుపతి సిటీ:డీఎస్సీ–25 పరీక్షలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నార్మలైజేషన్ ప్రక్రియతో బయాలజీ, సోషియల్ సబ్జెక్టులలో పరీక్షలు రాసిన అభ్యర్థుల కు భారీ స్థాయిలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం ప్రభుత్వం నార్మలైజేషన్ ప్రక్రియకు స్వస్తి పలికి అందరికీ సమన్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మార్కుల కేటాయింపులో అన్యాయం

నార్మలైజేషన్ ప్రక్రియతో తమకు అన్యాయం జరిగిందంటూ డీఎస్సీ హెల్ప్‌లైన్ డెస్క్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. అభ్యర్థులు మాట్లాడుతూ.. డీఎస్సీ పరీక్షలో మార్కుల కేటాయింపులో అందరికీ న్యాయం జరగలేదన్నారు. బయాలజీ విభాగంలో ఉదయం షిఫ్ట్‌లో అధిక సంఖ్యలో అభ్యర్థులు పరీక్షలు రాయగా, మధ్యాహ్నం షిఫ్ట్‌లో స్వల్ప సంఖ్యలో అభ్యర్థులు పరీక్షలు రాశారన్నారని తెలిపారు. కానీ ప్రభుత్వం చేపట్టిన నార్మలైజేషన్ ద్వారా తమకు అన్యాయం జరిగినట్లు స్పష్టంగా గమనించామన్నారు. ప్రధానంగా మధ్యాహ్నం రెండవ షిఫ్ట్‌లో పరీక్షలు రాసిన అభ్యర్థులకు సరాసరి మార్కుల గణనలో మూడు నుంచి నాలుగు మార్కులు అదనంగా వేశారని చెబుతున్నారు.

ఆన్‌లైన్ విధానమే కొంపముంచిందా!

గతంలో డీఎస్సీ పరీక్షలు ఆఫ్‌లైన్ విధానంలో ఓఎమ్ఆర్ జవాబు పత్రాల ఆధారంగా నిర్వహించేవారు. ఒక సబ్జెక్ట్ అభ్యర్థులకు ఒకే ప్రశ్నాపత్రం ఉండటంతో అభ్యర్థులు సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా ర్యాంకులు ప్రకటించి ఉద్యోగాలకు ఎంపిక చేసేవారు. కానీ ప్రస్తుతం జరిగిన డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించి అభ్యర్థులను గందరగోళానికి గురిచేశారు. నార్మలైజేషన్ ప్రక్రియతో వారికి 80 శాతం మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని, మొదటి షిఫ్ట్‌లో రాసిన వారికి 20 శాతం మందికి కూడా ఉద్యోగాలు వచ్చే అవకాశం లేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అందరికీ సమన్యాయం చేయాలి

రెండవ షిఫ్ట్‌లో తెలుగు మీడియంతో పాటు ఇంగ్లీషు, ఉర్దూ, తమిళ, ఒడిశా, కన్నడ మీడియం అభ్యర్థులు కలిసి పరీక్షలకు హాజరయ్యారని, వారందరినీ కలిపి నార్మలైజేషన్ చేయడం వలన ఉదయం షిఫ్ట్‌లో పరీక్షలు రాసిన వారికి తీవ్ర అన్యాయం జరుగిందన్నారు. జిల్లాలో పదుల సంఖ్యలో మాత్రమే బయాలజీ పోస్టులు ఉన్నందున్న ప్రతిభ గల అభ్యర్థులు ఉద్యోగాన్ని కోల్పోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోషియల్ విభాగంలో పరీక్షలు రాసిన అభ్యర్థులు సైతం ఇదే సమస్య ఎదుర్కొంటున్నట్లు సమాచారం. వెంటనే ప్రభుత్వం నార్మలైజేషన్ విషయంలో రెండు షిఫ్ట్‌లలో పరీక్షలు రాసిన అభ్యర్థులకు సమన్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఫలితాలను సవరిస్తే ప్రతిభ గల అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికవుతారని ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

నష్టపోతున్నామని అభ్యర్థుల ఆందోళన


జిల్లా నుంచి వేల మంది అభ్యర్థులు ఈ విషయంపై ఇప్పటికే డీఎస్సీ హెల్ప్ డెస్క్‌కు ఫిర్యాదు చేశారు. నార్మలైజేషన్ ప్రక్రియతో ఉదయం షిఫ్ట్‌లో పరీక్షలకు హాజరైన సుమారు 4 నుంచి 5 మార్కులు నష్టపోతున్నామని మొరపెట్టుకున్నారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి వెంటనే చొరవ చూపి నార్మలైజేషన్ ప్రక్రియను ఎత్తివేసి అందరికీ సమానంగా న్యాయం చేయాలని సోషల్ మీడియాలో బయాలజీ అభ్యర్థుల ఆవేదన వీడియోలు హల్‌చల్ చేస్తున్నాయి.

డీఎస్సీ అభ్యర్థులకు శాపం




డీఎస్సీ పరీక్షలు రాసిన అభ్యర్థులకు నార్మలైజేషన్ రూపంలో పెద్ద గండం ఎదురైంది. నార్మలైజేషన్‌తో ఉదయం షిఫ్ట్‌లో పరీక్ష రాసిన వారికి ప్రశ్నపత్రం సులువుగా, రెండవ షిఫ్ట్‌లో పరీక్షలు రాసిన వారికి కష్టంగాను రావడంతో ప్రతిభను కొలవలేం.
– సుధాకర్‌రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు, తిరుపతి

ఆన్‌లైన్ విధానంతోనే తిప్పలు



ఆఫ్‌లైన్ విధానంలో పరీక్షల నిర్వహణ జరిపి ఉండాల్సింది. ప్రస్తుతం నార్మలైజేషన్ ప్రక్రియలో విద్యార్థుల మార్కుల గణనలో తేడాలు రావడంతో అయోమయం నెలకొంది. ఈ విషయాన్ని ప్రభుత్వ పరిగణలోనికి తీసుకోవాలి.
– సావిత్రమ్మ, ప్రైవేటు విద్యాసంస్థ అధ్యాపకురాలు, తిరుపతి

అందరికీ న్యాయం చేయాలి



డీఎస్సీ అభ్యర్థులు ఎన్నో ఏళ్ల గా కష్టపడి పరీక్షలు రాశా రు. మార్కుల గణనలో నార్మలైజేషన్ ప్రక్రియతో చాలా మంది ప్రతిభగల అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఒక షిఫ్ట్‌లో పరీక్షలు రాసినవారే ఎక్కువ మంది ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. పరిశీలించి అందరికీ న్యాయం చేయాలి.
– సుదర్శన్ రావు, విశ్రాంత అధ్యాపకులు, తిరుపతి

ఆధ్యాత్మికత దిశగా పల్లెసీమలు



పుంగనూరు : బాగేపల్లె గంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: ప్రతి గ్రామంలోనూ రామాలయాలు, గంగమ్మ ఆలయాలు నిర్మించి, ఆధ్యాత్మికత వైపు పల్లెలు పయనిస్తుండడం అభినందనీయమని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం మండలంలోని బాగేపల్లె గ్రామంలో గ్రామస్తులు నిర్మిస్తున్న నూతన గంగమ్మ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్దిరెడ్డికి మంగళ హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సరదాగా గడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు భక్తిమార్గంలో పయని స్తున్నారని కొనియాడారు. గంగమ్మ తల్లి ప్రజలందరినీ చల్లగా చూడాలని, సకాలంలో వర్షాలు కురిసి, పంటలు పండి ప్రజలంతా అభివృద్ధి చెందాలని కోరారు. ఎంపీపీ అక్కిసాని భాస్క ర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామమోహన్‌రెడ్డి, రాజారెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్‌టీఆర్‌పై వ్యాఖ్యలు అనుచితం



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి రోజా

నగరి/చిల్లకూరు : అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపడంపై మాజీ మంత్రి ఆర్‌కే రోజా స్పందించారు. ఆదివారం మీడియాతో ఆమె మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ, జూనియర్ ఎన్టీఆర్ కుటుంబం అంటే తెలుగుదేశం పార్టీకి ఎప్పటికీ చిన్నచూపే అన్నారు. జూనియర్ ఎన్టీఆర్ సినిమా ప్రదర్శనను ఆపాలనుకోవడం అంటే అరచేతిని అడ్డుపెట్టి సూర్యుడిని ఆపినట్టే అవుతుందని రోజా వ్యాఖ్యానించారు. జూనియర్ ఎన్టీఆర్ సినిమాలను ప్రతి ఒక్కరూ ఇష్టపడతారని, ప్రజల్లో మాస్ ఇమేజ్ ఉన్న హీరో సినిమాను అడ్డుకోవాలనుకోవడం హాస్యాస్పదమన్నారు. సినిమా బాగుంటే ఎవరూ అడ్డుకోలేరని, బాగోలేకపోతే ఎవరూ దాన్ని ఆడించలేరని స్పష్టం చేశారు. ఈ విషయం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు సినిమాతో నిరూపితమైందన్నారు. టీడీపీ-జనసేన ఎమ్మెల్యేలు తలకిందులుగా తపస్సు చేసి, టికెట్లు ఫ్రీగా ఇచ్చినా కూడా హరిహర వీరమల్లు సినిమాను ఆడించలేకపోయారని గుర్తుచేశారు. సినిమా ఫంక్షన్లల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిట్టడం, సవాళ్ల చేయడం వంటివి జరిగితే గేమ్ ఛేంజర్ గానీ, హరిహరవీరమల్లు లాంటి సినిమాలు ఏమయ్యాయో మనం కళ్లారా చూశామన్నారు. జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లో లేడని, ఆయన సినిమాలు చేసుకుంటున్నాడని, ఆయన అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సొంతం చేసుకుంటున్న విషయం మనం చూస్తున్నామన్నారు.

లోకేష్ మెప్పు పొందేందుకే ..



అహంకారంతో ఎమ్మెల్యేలు ఎలా పడితే అలా మాట్లాడుతున్నారు. ఇలా మాట్లాడడం వల్ల లోకేష్ మెప్పు పొందవచ్చని అనుకుంటున్నారు. గతంలో టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావును అనరాని మాటలు అన్న రోజులు నేటికీ కూడా ప్రతి ఒక్కరికీ గుర్తున్నాయి. ఇప్పుడు కూడా అదే బాటలో టీడీపీ ఎమ్మెల్యేలు పయనిస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్‌ను రాయలేని భాషలో తిట్టడం శోచనీయం. కూటమి ప్రభుత్వం అధికారం చేట్టిన తర్వాత అహంకారంతో నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారు. ఎన్టీఆర్‌ను ఇలా అనరాని మాటలు అనడం సరైన పద్ధతి కాదు.
– మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదె మృతి

చిట్టమూరు : మండలంలోని అనగొల్లపాళెంలో ఆదివారం విద్యుదాఘాతంతో ఓ గేదె మృతి చెందింది. వివరాలు.. గ్రామానికి చెందిన కట్టబోయిన విజయభాస్కర్‌కు చెందిన గేదె ఉదయం మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లడంతో కరెంట్ షాక్ తగిలింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వారం రోజుల క్రితం రెండు గేదెలు ఇదే విధంగా మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. మృత్యువాత పడిన గేదె విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని బాధిత రైతు వెల్లడించారు. ఇన్‌చార్జి లైన్‌మన్ సునీల్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇకపై ప్రమాదాలు జరగకుండా ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసినట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చంద్రగిరి : పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై నడింపల్లె వద్ద ఆదివారం వేకువజామున జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మహిళ మృత్యువాత పడింది. అదే మార్గంలో వెళుతున్న పలు వాహనాలు తొక్కించేయడంతో మహిళ మృతదేహం గుర్తుపట్టలేని విధంగా నుజ్జునుజ్జుగా మారింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు అదృశ్యం


ముత్తుస్వామి (ఫైల్)

రేణిగుంట : రేణిగుంట రైల్వే స్టేషన్‌లో వృద్ధుడు అదృశ్యమైనట్లు కుటుంబీకులు రైల్వే పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. తమిళనాడుకు చెందిన ముత్తుస్వామి(65) ఈ నెల 15వ తేదీన రేణిగుంట రైల్వే స్టేషన్‌లో కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కే సమయంలో కనిపించకుండాపోయినట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9930984331, 8779133404, 6380809173 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

వృద్ధురాలిపై దాడి


గాయపడిన వెంకటమ్మ

తొట్టంబేడు: మండలంలోని చేమూరులో ఆదివారం గాలి వెంకటమ్మ అనే వృద్ధురాలిపై ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. వివరాలు.. గాలి వెంకటమ్మకు కుమారుడు గురవయ్య, కోడలు పార్వతమ్మ ఉన్నారు. కొడుకు, కోడలు తరచూ గొడవపడేవారు. ఈక్రమంలో కోడలు ఇంటి నుంచి వెళ్లిపోయింది. రెండు రోజులుగా కనపడకపోవడంతో కోడలి తమ్ముడు ఉపేంద్ర ఆగ్రహంతో వెంకటమ్మపై దాడి చేశాడు. బాధితురాలిని శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బలరామ్ తెలిపారు.

గుంతలు బాబోయ్!


టీపీకోట వద్ద ద్విచక్ర వాహనదారుల అవస్థలు

ఎన్నికల సమయంలో చంద్రబాబు మాటలు కోటలు దాటుతాయ్.. అధికారంలోకి వచ్చాక హామీలు తూతూమంత్రంగానే అమలవుతాయ్.. ఓట్ల కోసం వచ్చినప్పుడు ప్రజల అవస్థలు ఆవేదన కలిగిస్తాయ్.. పీఠం ఎక్కిన తర్వాత జనం ఇక్కట్లు ఆనందంగా కనిపిస్తాయ్. ఇందుకు నాగలాపురం-చిన్నపాండూరు మార్గమే ప్రత్యక్ష నిదర్శనం. గతంలో ఆ రహదారిని అద్భుతంగా తీర్చిదిద్దుతామని ఘనత వహించిన బాబుగారు ఆర్భాటంగా ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా ఆ సంగతే మరిచారు. గుంతలమయంగా మారిన రోడ్డులో రాకపోకలు సాగించేందుక గ్రామీణులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. అయినప్పటికీ పాలకులు పట్టించుకోరు. అధికారులు కనీసం మాత్రం స్పందించరు.

- అధ్వాన్నంగా నాగలాపురం-చిన్నపాండూరు మార్గం
- గ్రామీణుల అవస్థలు వర్ణనాతీతం
- వాహనదారులకు నిత్యం నరకం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- స్పందించని అధికార యంత్రాంగం


టీపీకోట వద్ద దుస్థితి

వరదయ్యపాళెం : సత్యవేడు నియోజకవర్గంలోని నాగలాపురం నుంచి టీపీకోట మీదుగా చిన్నపాండూరుకు వెళ్లే ప్రధాన రోడ్డు అధ్వానంగా మారింది. కళ మార్గంలో పలుచోట్ల మట్టి రోడ్డుగా దర్శనమిస్తోంది. ఒకప్పుడు తారురోడ్డుగా ఉన్న ఈ ప్రాంతం పూర్తిగా రూపురేఖలు కోల్పోయింది. దీంతో ప్రజలు రాకపోకలకు పడుతున్న కష్టాలు వర్ణనాతీతమే. రోడ్డు పొడవునా బావులను తలపించేలా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో బస్సులు, కార్లు, లారీలు సైతం ఆ మార్గంలో వెళ్లడం కష్టతరంగా మారింది. ఇక ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి దుస్థితిలో సుమారు 20 గ్రామాలకు పైగా ప్రజల రాకపోకలకు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు.


రూపురేఖలు కోల్పోయిన నాగలాపురం-చిన్న పాండూరు రోడ్డు


కడివేడు సమీపంలో..

రూ. 71కోట్లతో ప్రతిపాదనలు

నాగలాపురం-చిన్న పాండూరు రోడ్డుఅభివద్ధి కోసం రూ. 71కోట్లతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు. అయితే నిధులు మంజూరు చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం గమనార్హం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 19 కిలోమీటర్ల మేర రోడ్డు అభివద్ధి కోసం రూ. 49కోట్లు మంజూరు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంచాన వ్యయం పెంచి రూ. 71కోట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.


మట్టి రోడ్డును తలపిస్తూ..


పాదిరికుప్పం వద్ద ..

అమలు కాని హామీ

ఈ రోడ్డు సమస్యను గతంలో సత్యవేడు గడియారం కూడలిలో నిర్వహించిన సార్వత్రిక ఎన్నిక ప్రచార సభకు హాజరైన చంద్రబాబుకు స్థానికులు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే నాగలాపురం- చిన్న పాండూరు మార్గంలో 29 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డుగా అభివద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు రోడ్డు అభివద్ధిపై కనీస మాత్రం స్పందన లేదు.

“

తక్షణమే రోడ్డు నిర్మించాలి



నాగలాపురం-చిన్న పాండూరు రోడ్డు దుస్థితిని మాటల్లో చెప్పలేం. రాకపోకలకు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. తక్షణమే రోడ్డు నిర్మించాలి. ఈ మేరకు ప్రభుత్వం చొరవ చూపాలి. – దానివేలు, బీరకుప్పం

నిధులు మంజూరు చేయాలి



రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి. సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఇందుకోసం అధికారులు కృషి చేయాలి. – ఈశ్వర్, కడివేడు

లారీల తాకిడికి ధ్వంసం



చిన్నపాండూరుకు వెళ్లే రోడ్డు పొడవునా బావులను తలపించే గుంతలు ఉన్నాయి. ప్రధానంగా చమర్తకండ్రిగ వరకు కంకర లారీల తాకిడికి రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రాత్రి వేళల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. – మురళీరెడ్డి, సిద్ధాపురం

దాడి కేసులో నిందితుల అరెస్ట్

దొరవారిసత్రం : మండలంలోని ఆనేపూడి సమీపంలో రెండు రోజుల క్రితం ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో నిందితులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలు.. పడమటికండ్రిగకు చెందని సమ్మన రాజయ్య, వడ్డికండ్రిగకు చెందిన వలిపి నారయ్య మధ్య కొంతకాలంగా వివాదాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే రాజయ్యను కొట్టించేందుకు నారయ్య పథకం వేశాడు. ఈ మేరకు సూళ్లూరుపేటకు చెందిన నలుగురు మైనర్ బాలు రతో కలిసి ఆనేపూడి శివారులో కాపుకాసి రాజయ్యపై దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ అజయ్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. నిందితులను అదుపులోకి తీసుకుని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్‌కు తరలించారు.

తల్లీబిడ్డల అదృశ్యంపై ఫిర్యాదు

సత్యవేడు: మండలంలోని మదనంబేడు దళితవాడలో తల్లీబిడ్డల అదృశ్యంపై పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందింది. వివరాలు.. నిత్య తన భార్య పూజ, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నాడు. రెండు రోజుల క్రితం భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన పూజ తన ఇద్దరు పిల్లలతో కలిసి శనివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ రామస్వామి కేసు నమోదు చేశారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు 9440796767 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

రెండు లారీలు ఢీ

– ముగ్గురికి గాయాలు


ధ్వంసమైన లారీలు

తొట్టంబేడు : శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. వెస్ట్‌బెంగాల్ నుంచి బెంగళూరుకు ఐరన్‌రాడ్ల లోడ్ లారీతో డ్రైవర్లు చాన్ బాషా, జాకీర్ వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో లారీ ఢీకొంది. ప్రమాదంలో చాన్‌బాషా, జాకీర్, మరో లారీ డ్రైవర్ గిరీష్ గాయపడ్డారు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గూడూరు జిల్లా కోసం బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సాధన సమితి సభ్యులు

చిల్లకూరు : గూడూరు జిల్లాగా ప్రకటించాలని, పట్టణంలోనే కేంద్రం ఏర్పాటు చేయాలని గూడూరు జిల్లా సాధన సమితి సభ్యులు ఆదివారం బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను కలసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సాధన సమితి కన్వీనర్ వేగూరు రాజేంద్రప్రసాద్, సుమన్‌రెడ్డి, అశోక్, గోపని, పురుషోత్తం, అరుణ్‌కుమార్, దినేష్, ఇబ్రహీం, సంతన్, విజయ్, రాజేష్, శివ, మధు, వెంకటరమణ, పసల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యారంగ సమస్యలపై నిరసనలు


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

తిరుపతి సిటీ : జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు విద్యారంగ సమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆదివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తీర్మానించింది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, భగత్ రవి మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల లేకపోవడం సిగ్గుచేటన్నారు. వసతి గృహాల్లో పిల్లలు వసతులులేక ఇబ్బందిపడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యారంగంలో విప్లవం తీసుకువస్తామని మంత్రి లోకేష్ చెప్పిన మాటలు నీటిమూటలుగా మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.6,400కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రభుత్వం మెడలు వంచేలా విద్యార్థులు నిరసన కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, వినోద్, తేజ, సభ్యులు శ్రీనివాస్, రవీంద్ర పాల్గొన్నారు.

ప్లాంటేషన్ పనులు అడ్డగించిన వారిపై కేసు

తొట్టంబేడు: శ్రీకాళహస్తి మండలం ఇలగనూరు రిజర్వ్ ఫారెస్ట్‌లో 50 హెక్టార్లలో చేపట్టిన ప్లాంటేషన్ పనులను అడ్డుకున్న సింహాచలకండ్రిగ వాసులపై కేసులు నమోదు చేసినట్లు అటవీ క్షేత్రాధికారి లోకేష్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్లాంటేషన్ చేపట్టిన భూములు తమవని గ్రామస్తులు అడ్డుకున్నారని, అయితే సదరు భూములు రిజర్వ్ ఫారెస్ట్‌గా గతంలోనే ప్రకటించినట్లు వెల్లడించారు. అయినప్పటికీ అడ్డుకునన్న కసుమూరి కోటయ్య, పామర్తి సాంబశివయ్య, తక్కిలపాటి తిరుపాలయ్య, బండి ప్రసాద్, కసుమూరి శంకరయ్యపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కాళంగి కన్నీరు!

- నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- నిర్మాణంలోని ఇళ్ల ముందు డంపింగ్
- ట్రాక్టర్లతో తమిళనాడుకు తరలింపు


ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న కూలీలు

సూళ్లూరుపేట రూరల్ : కూటమి నేతల అధికారం అండతో రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా ఇసుక స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. ఇందుకోసం కాళంగి నదిని కన్నీరు పెట్టిస్తున్నారు. యంత్రాల సాయంతో ఇష్టారాజ్యంగా తవ్వేసి ఇసుకను సమీప గ్రామాల్లో నిర్మిస్తున్న ఇళ్ల ముందు డంప్ చేసుకుంటున్నారు. రాత్రివేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు.

డిమాండ్ అధికం

తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో విస్తరించిన కాళంగి నదిలో నాణ్యమైన ఇసుక ఉంది. దీనికి ఇతర ప్రాంతాల్లో డిమాండ్ అధికంగా ఉంది. ఇది గుర్తించిన ఇసుకాసురులు నదిని తోడేస్తున్నారు. ప్రధానంగా ఇలుపూరు గ్రామం వద్ద నది పొర్లు కట్టను తవ్వి దారి ఏర్పాటు చేసుకుని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.


హైవేపై దర్జాగా వెళుతున్న ఇసుక ట్రాక్టరు

రోజూ వందలాది ట్రాక్టర్లతో..

ఇలుపూరు గ్రామం నుంచి రోజూ వందలాది ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. టీడీపీ నేతల కనుసన్నల్లో అక్రమార్కులు ఇసుకను యథేచ్ఛగా సరిహద్దులు దాటించి తమిళనాడుకు చేరుస్తున్నారు. దర్జాగా ఇసుక ట్రాక్టర్లును హైవేపైనే వెళుతుండడం గమనార్హం. కళ్ల ఎదుటే ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నా హైవే పెట్రోలింగ్ సిబ్బంది సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడం కొసమెరుపు.

దయనీయం.. అయోమయం



- డిసిగ్నేషన్ లేని దుస్థితిలో తాత్కాలిక అధ్యాపకులు
- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదా ఊసే ఎత్తని అధికారులు
- అవకాశం దొరికితే వేటు వేసేందుకే ప్రయత్నాలు

తిరుపతి సిటీ : విశ్వవిద్యాలయాల్లోని తాత్కాలిక అధ్యాపకుల పరిస్థితి దయనీయంగా మారింది. ఉద్యోగ భద్రతలేని అయోమయంలో కొట్టుమిట్టాడే దుస్థితి దాపురించింది. ఈ క్రమంలోనే వర్సిటీ అధికారుల నిరంకుశ ధోరణపై నోరు మెదపలేని పరిస్థితి. వాస్తవానికి విద్యార్థులు, పరిశోధకులకు తోడ్పాటు అందిస్తోంది తాత్కాలిక అధ్యాపకులే. అయినా వారిని ఉన్నత విద్యామండలి, వర్సిటీల అధికారులు చిన్నచూపు చూస్తున్నారు.

డిసిగ్నేషన్ ఏదీ..?

తాత్కాలిక అధ్యాపకులకు డెసిగ్నేషన్ కూడా లేదు. పక్క రాష్ట్రాల్లో, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో తాత్కాలిక అధ్యాపకులకు 'అసిస్టెంట్ ప్రొఫెసర్' హోదా కల్పించారు. మన రాష్ట్రంలో మాత్రం వారిని మూడు నెలలకు ఒకసారి కాంట్రాక్టులు రెన్యువల్ చేస్తూ, వేతనాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదు. వర్సిటీలలోఅన్యాయాలపై ఎవరు గళం విప్పినా వేతనాలు నిలిపివేస్తారు. ప్రతి మూడు నెలలకు ఉద్యోగం ఉంటుందో లేదో అనే ఆందోళన వల్ల బోధన, పరిశోధన సక్రమంగా చేయలేక అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.

శాశ్వత అధ్యాపకుల నియామకాలు లేనట్టేనా?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్సిటీలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసి నిరుద్యోగులకు శతగోపం పెట్టేసింది. ఏళ్ల తరబడి నోటిఫికేషన్ కోసం ఎదురు చూసి, రూ.లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకున్న అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లింది. ప్రస్తుతం వందల సంఖ్యలో వర్సిటీలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల నియామకాలు చేపట్టేందుకు కూటమి ప్రయత్నం మొగ్గు చూపకపోవడం దారుణమని విద్యార్థులు, మేధావులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వీధిన పడేయడం దారుణం

తాత్కాలిక అధ్యాపకుల పరిస్థితి రోజు రోజుకి దారుణంగా తాయారవుతోంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉద్యోగం ఉంటుందో.. పోతుందో అనే భయంతో జీవిస్తున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, 'పెర్ఫార్మెన్స్ రివ్యూ' పేరుతో అనేకమందిని తొలగించారు. ఏళ్ల తరబడి సేవలందించిన అధ్యాపకులను సైతం వీధుల్లో పడేశారు.

“

ఉన్నత విద్యామండలి చొరవ చూపాలి

తాత్కాలిక అధ్యాపకులకు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా హోదా కల్పించాలి. ఈ విషయంపై ఉన్నత విద్యామండలి చొరవ చూపాలి. వర్సిటీ అధికారులతో చర్చించి వారికి డిసిగ్నేషన్ కల్పించే ప్రయత్నం చేయాలి. శాశ్వత అధ్యాపకుల నియామకాలకు ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలి. తొలగించిన అధ్యాపకులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి.

– విద్యార్థి సంఘాల నేతలు, ఎస్వీయూ


జలదిగ్బంధంలో..


గరుడ వారధి కింద వర్షపు నీరు

తిరుపతిలో జోరువాన

తిరుపతి నగరంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు జోరుగా వాన పడడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. నగర వాసులు, శ్రీవారి భక్తులు రాకపోకలు నానా అవస్థలు పడ్డారు. పలుచోట్ల వాహనాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. – సాక్షి ప్రతినిధి, తిరుపతి


మోకాటిలోతు నీటిలో..


నడప లేక నెట్టుకుంటూ..